# పట్టుచీర

ఉత్తరం చేతిలో పట్టుకుని లోపలికి పరుగెట్టింది శశి. మూడు నెలల క్రితం ముచ్చటగా పడిన మూడు ముళ్ళు ఆమెలో కొత్త పులకింతలు రేపుతున్నాయి. ఉండుండి మంగళసూత్రాలు ఊరికే గిలిగింతలు పెడుతున్నాయి. అలవాటుగా పరుగు పెడితే కాలి మట్టెలు, పట్టాల మువ్వలూ మురిపెంగా మోగుతున్నాయి. బంగారు గాజుల మధ్య ధగధగ మెరిసే మట్టిగాజులు మౌన సంగీతాలు మదిలో వినిపిస్తున్నాయి.

"అమ్మాయి! ఉత్తరం ఎక్కడ్నించి?" వంటింట్లోంచి కాంతమ్మ మూడోసారి కేకవేసింది. శశి అప్పటికే ఉత్తరం తెరిచి రెండుసార్లు చదవడం పూర్తిచేసింది. మంత్రముగ్ధలా అదే మళ్ళీ మొదలుపెట్టబోతూండగా – తల్లి కేక వినిపించింది.

"ఆ .... వస్తున్నాను" అంది.

"రానక్కరలేదు. ఉత్తరం ఎక్కడినుంచీ అంటే మాట్లాడవేమే మా తల్లి" అంది.

'ఆయన రాశారమ్మా' అంది నెమ్మదిగా. ఆ మాటతో తల్లి మరింక మాట్లాడదని ఆశతో –

"ఏమంటాడు" అంటూ దీర్ఘం తీసింది కాంతమ్మ.

"ఏమీ లేదు. అంతా బాగున్నార్ట" అంది ముక్తసరిగా. కాంతమ్మ ఆశ్చర్యంగా కూతురి ముఖంలోకి చూసి, "అదేమిటే? అంత పెద్ద కాగితంలోనూ ఆ రెండు ముక్కలేనా" అని – "సర్లే పిచ్చిముఖమా! ఏదో రాసి వుంటాడు అల్లుడు" అంటూ పనిలో పడిపోయింది. తల్లి అక్కడితో వదిలినందుకు తేలికగా నిట్టూర్చింది. శశి మళ్ళీ ఉత్తరం చదవడం మొదలుపెట్టింది. చివర రాసిన మాటలు ఆమెను మరీ గిలిగింతలు పెడుతున్నాయి.

"శశీ డియర్! మామిడిపండు రంగు మీద నల్లజరీ అంచు పట్టుచీర నీకెంతో బాగుంటుందని ఊహించుకుంటూ నేనే స్వయంగా వెళ్ళి కంచి షోరూంలో కొన్నాను. నువ్వా చీరలో ఎంత మెరిసిపోతావో చూడాలని తహతహలాడిపోతున్నాను. నేను శుక్రవారం వస్తున్నాను. మళ్ళీ శనివారం ఆఫీసు టైముకి యిక్కడికి వచ్చేస్తాను. ఆ చీర కట్టుకుని నువ్వు పూజ పేరంటం చేసుకుని నా దగ్గరకొచ్చి, మెత్తని ఆ పట్టు చీరలో....'

శశి చటుక్కున ఉత్తరం మూసేసింది. ఆమె బుగ్గలు కెంపులయ్యాయి. సిగ్గుతో వొళ్ళంతా పులకించిపోయింది. తనకి అత్తవారు పంపిన శ్రావణపట్టీ పట్టుచీర మడతలో ఉత్తరం భద్రంగా దాచుకుంది.

❖ ❖ ❖

ఆఖరి పేరంటం పూర్తిచేసుకుని శశి వేగంగా నడుస్తోంది. ఎన్నాళ్ళకో చూసిన లక్ష్మి మధ్యలో కనిపించి పది నిముషాలు ఆపేసింది. అయినా హడావిడిగా వదిలించుకుని వచ్చేసింది. మనసు నిండా అలజడి. ఈయన వచ్చేశారేమో! వచ్చేస్తే తనింకా రాలేదని చిటపటలాడుతున్నారేమో! అమ్మ కాఫీ అయినా ఇచ్చిందో లేదో - అమ్మ కాఫీలో పంచదార ఎక్కువ వేస్తుంది. ఆయనకి కాఫీలో పంచదార ఎక్కువ పడకూడదు. చేదుగా వుండాలి -

శశి అనేక రకమైన ఆలోచనలతో సతమతమవుతూ చకచకా నడుస్తోంది. సన్నగా జల్లు ప్రారంభమైంది. ఆరుగంటలయిందో లేదో చీకట్లు ముసురుకున్నాయి. ఎలాగైతేనే పరుగులాంటి నడకతో యింట్లో కొచ్చిపడింది శశి.

భర్త వచ్చాశాడేమోనని చూసింది. వచ్చిన జాడేం లేదు. తల్లి నడుగుదామను కుంది. వెంటనే సిగ్గు వచ్చి ఆగిపోయింది. అంతలోనే వచ్చి తను లేనని మళ్ళీ బయటకెళ్ళిపోలేదు కదా అని భయపడిపోయింది.

ముఖం చూసుకుంది అద్దంలో -

మెడనిండా గంధం - అందరూ పెట్టిన బొట్టు ఎదిగి ఎదిగి పావలాకాసంత యింది. జడలో చేమంతులు, మల్లెలు చెంపలమీంచి తొంగిచూస్తున్నాయి.

పాత సినిమా పాట గుర్తుకొచ్చింది.

పడమట సంధ్యారాగం.

కుడి ఎడమల కుసుమపరాగం - అంటూ కూనిరాగం తీసుకుంటూ కాళ్ళు కడుక్కోటానికెళ్ళింది.

"అమ్మాయి శశీ– ఆ పట్టుచీర మార్చుకుని ముందు గది కాస్త సర్దు. మరీ గందరగోళంగా వుంది. అతనొస్తాడు" అంది వంటింట్లోంచి. సెనగలు పోతాళిస్తున్న గుబాళింపు గుప్పుమంది.

శశి చీర మార్చకుండా ఇల్లు శుభ్రంగా సర్దేసింది. చీపురుతో ఊడ్చి పోగు తలుపు చాటుకి తోసింది. ఇంతలో కాంతమ్మ "చీర మార్చుకోవే! పాడయిపోతుంది" అంటూ దీర్ఘం తీసింది.

"మార్చుకుంటాలే" అంటూ తనూ సాగదీసి తలలో పూలు సర్దుకోవడం – బొట్టు చిన్నదిగా సరిదిద్దుకోవడం చేస్తోంది.

మదిలో – చెలి మోహనరాగం ఊ....ఊ... జీవితమే మధురానురాగం.

వానజల్లు కాస్త పెరిగింది. శశి గుండె దడదడలాడింది. మధ్యలో తడిసిపోతా రేమో – తల తడిస్తే మంచిది కూడా కాదు– అసంకల్పితంగా వీధి వాకిట్లోకి వెళ్ళిచూసింది. రివ్వున గాలి ముంగురుల్ని రేపింది. సన్నటి జల్లు జాకెట్టును తడిపింది. మళ్ళీ ఇంట్లోకి వచ్చింది.

"ఇదిగో చెప్పినమాట వినవు కదా! వానలో కూడా తడిపేసుకుంటావెందుకు? ఖరీదైన చీర –, విప్పేసి వాయిల్ చీర కట్టుకుని, సాపుగా మడతెట్టుకునీ..." తల్లి మాటల్ని తుంచేస్తూ...

"అబ్బ వుండవే! చంపుకుతింటున్నావు. మార్చుకుంటానులేవే" అని విసుక్కుని, అక్కడే వున్న వారపత్రిక అందుకుని తిరగేయడం మొదలెట్టింది.

ఆమె బుర్ర చురుకుగా ఆలోచిస్తోంది. ఈ మహానుభావులు మరో అరగంట ఆలస్యం చేస్తే,అ మ్మ నన్ను సాధించి సాధించి పట్టుచీర మార్పించిగానీ వూరుకోదు. తీరా ఆయన వచ్చేసరికి తనా చీరలో వుండకపోతే కోపమొస్తుందేమో! కాకపోయినా నిరుత్సాహపడినా తను సహించగలదా! అయినా అమ్మకి బొత్తిగా ఏమీ తెలీదు.

"ఏమే మళ్ళీ పుస్తకం పట్టావు? చీర మార్చుకోవే అంటే వినవు కదా! నలిగిపోతుందని కదా చెప్తున్నాను. పొద్దున్న పక్కింటి కామేశ్వరికి చూపించాను. ఆ చీర ఎనిమిది వందలకి తక్కువ ఉండదని చెప్పింది తెలుసా!" అంది బుద్ధి చెప్తున్న ధోరణిలో.

"అనడమే కనిపిస్తోంది. నీ చెవిలో పడడమే లేదు" అంది.

"మారుస్తాగా" అంది.

"అవునూ! చెప్పిన మాట వెంటనే వినవు. ముచ్చు మూడు రూపులా ఆ తండ్రి పోలికే. నోట్లోంచే ఊడిపడ్డావు మా తల్లీవి' అంది.

శశి వెయ్యి దేవుళ్ళకి మొక్కుకోవడం మొదలుపెట్టింది. "అవునూ! ఇంత మొండితనమైతే రేపు అత్తారింట్లో..."

బయట గేటు చప్పుడైంది. కాంతమ్మ మాటలు ఆపేసింది. శశి ఆశగా వీధివైపు చూసింది. అవును. అతనే – ఒక్క పరుగు తీసింది. అతను వస్తూనే పక్క గదిలోకి వెళ్ళిపోయాడు. మంచినీళ్ళ గ్లాసు తీసుకుని అతని వెనకాలే వెళ్ళి నీళ్లగ్లాసు కిటికీలో పెట్టి అతన్ని చూసింది. అతను ఆశ్చర్యంగా భార్యని చూసి, మురిపెంగా ముద్దు పెట్టుకుని గట్టిగా కౌగలించుకున్నాడు.

"శశీ! ఈ చీరలో నువ్వెంత బాగున్నావో తెలుసా" అంటూన్న అతని మాటలు పరవశంగా వింది, ఆమె ఆ మాటల కోసం ఎంత సేపుగానో ఎదురుచూస్తోంది. ఆ మాటలు తియ్యగా గుండెల్ని తాకుతున్నవేళ –

"అమ్మాయీ శశీ! చీర మార్చుకుని కంచాలు మంచినీళ్ళూ పెట్టు – అన్నాలు వడ్డిస్తాను" అంటూ సూదైన బాణాల్లా తల్లి మాటలు దూసుకొచ్చాయి.

శశి ఏదో సమాధానమివ్వబోయింది. అతనామెకా అవకాశం ఇవ్వలేదు.

అమ్మకి నిజంగా బుద్ధిలేదు అనుకుంది శశి మనసులో.